సాక్షి విశాఖపట్నం

శనివారం । 14 । జనవరి । 2023



మైమరిపించే మత్స్యలోకం IIలో



కొమ్మాది: రుషికొండ బీచ్ వద్ద కోస్ట్‌గార్డ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం జనరల్ డైరెక్టర్ నీలా పటానియా ప్రారంభించారు. మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన ఈ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ను అందుబాటులోనికి తీసుకువస్తున్నామన్నారు.

సంక్షేమ పథకాలతో సంక్రాంతి సంబరాలు



సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందడంతో జిల్లాలో సంక్రాంతి కళ సంతరించుకుందని కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున అన్నారు. పల్లెసీమలు సుభిక్షంగా కలకళలాడాలని కోరుతూ జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతున్నానని కలెక్టర్ తెలిపారు.

న్యూస్‌రీల్

18న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మహారాణిపేట (విశాఖ దక్షిణ): భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈనెల 18న విశాఖ వస్తున్నారు. నాలుగు రోజుల పాటు విశాఖలో ఉంటారు. 18న ఉదయం 11.45 గంటలకు చెన్నై నుంచి విమానంలో విశాఖ చేరుకుంటారు. విశాఖ విమానాశ్రయం నుంచి సాగర్‌నగర్‌లోని ఇంటికి వెళతారు. అక్కడ కొద్ది సేపు విశ్రాంతి తీసుకొని సాయంత్రం 4.50 గంటలకు సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా లోక్ నాయక్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రాత్రి 7 గంటలకు పోర్టు గెస్టు హౌస్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 19, 20, 21 తేదీల్లో అక్కడే ఉంటారు. 22న ఉదయం 7 గంటలకు పోర్టు గెస్టు హౌస్ నుంచి బయలు దేరి విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. విమానంలో హైదరాబాద్ వెళతారు.

మేయర్, కమిషనర్.. సంక్రాంతి శుభాకాంక్షలు



దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు నగర ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. భోగి మంటలతో మీ సమస్యలన్నీ మటుమాయం కావాలని, సంక్రాంతికి సిరిసంపదలు మీ ఇంట చేకూరాలని, కమ్మని పిండి వంటలతో కనుమ పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

జీడి మామిడి చెట్లకు 25న వేలం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): విశాఖ అటవీ డివిజన్‌లో జీడి మామిడితోటల నుంచి జీడిపిక్కలు సేకరించి, నిల్వ చేసుకొని, తీసుకువెళ్లడానికి అటవీ శాఖ వేలం నిర్వహిస్తుంది. జిల్లా అటవీశాఖాధికారి ఆధ్వర్యంలో ఈనెల 25న ఉదయం 11 గంటలకు టూరిజం డెవలప్‌మెంటు సెంటర్ కంబాలకొండ (లా కాలేజీ ఎదురుగా), పాతిన మల్లయ్యపాలెం దగ్గర బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. 25న జరుగు వేలంలో అమ్మకం కాని యూనిట్స్ తిరిగి ఫిబ్రవరి 7,16 తేదీల్లో వేలం నిర్వహిస్తారు. దువ్వాడలో (613 చెట్లు),కొవ్వాడలో (14 చెట్లు), చినగామయ్యపాలెంలో (2120 చెట్లు) వేలం నిర్వహిస్తున్నట్టు జిల్లా అటవీ శాఖాధికారి తెలిపారు. ఇతర వివరాలకు 94408 10034, 94408 10194కు సంప్రదించాలి.

బాగ్చీకు ఆపరేషన్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు



అరుణ్ కాంతి బాగ్చీ

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చీకు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఉక్కు మంత్రిత్వశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల వరకు డైరెక్టర్ (ఆపరేషన్స్)గా బాధ్యతలు నిర్వహించిన ఎ.కె. సక్సేనా మోయిల్ ఎండీగా బాధ్యతలు స్వీకరించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో బాగ్చీకు మార్చి 28 వరకు మూడు నెలల పాటు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ రన్నర్ విశాఖ

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో ఐదు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. అండర్-19 క్రికెట్ పోటీల్లో బాలుర జట్ల విభాగంలో కర్నూలు జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా విశాఖపట్నం జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. చిత్తూరు జిల్లా, ప్రకాశం జిల్లా జట్లు మూడు, నాలుగు స్థానాలను దక్కించుకున్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం జిల్లా జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 79 పరుగులు చేయగా కర్నూలు జిల్లా జట్టు విజయలక్ష్యాన్ని 10 ఓవర్లలోనే ఛేదించింది. దీంతో కర్నూలు జిల్లా జట్టు ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. మహిళల విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు విన్నర్‌గా అనంతపురం జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ పోటీలకు బాలుర జట్లు రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా తప్ప మిగిలిన12 జిల్లాల నుంచి హాజరయ్యారు. ఆరు జిల్లాల నుంచి బాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట అజయ్, కోచ్ ఉంగరాల లక్ష్మీనారాయణ (తాతయ్య), టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకుడు ఆర్ హంకింసింగ్ పర్యవేక్షించారు.

బ్లూ ఫ్లాగ్ బీచ్‌కు హంగులు



- రూ.1.69 కోట్లతో టెండర్లను ఆహ్వానించిన పర్యాటక శాఖ
- ఆధునిక హంగులు.. ఆకర్షణీయ రంగులు
- బీచ్ వాలీబాల్, క్రికెట్ కోర్టులు ఏర్పాటు
- వివాహ వేదిక ఏర్పాటుకు ప్రణాళికలు
- 6 నెలల్లోగా పర్యాటకులకు సరికొత్త బీచ్ పరిచయం చేసేందుకు టూరిజం శాఖ సన్నద్ధం



బీచ్‌లో వెడ్డింగ్ స్టేజ్

సాక్షి, విశాఖపట్నం : బీచ్ పేరు వింటే చాలు.. వయసుతో పనిలేకుండా మనసు గాల్లో తేలిపోతుంది. అలల సవ్వడి దగ్గరుండి చూడాలనీ.. కెరటాలతో ఆటలాడుకోవాలని ఆరాటపడేవారుండరంటే అతిశయోక్తి కాదేమో. అదే ఆ బీచ్ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందితే, పైగా ఆ తీరానికి వచ్చే పర్యాటకులకు సరికొత్త అనుభూతులను అందిస్తే.. సరిగ్గా ఇవే ఆలోచనలతో పర్యాటక శాఖ అడుగులు ముందుకు వేస్తోంది. ఆధునిక హంగులు ఆకర్షణీయ రంగులతో ప్రపంచ స్థాయిలో బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌కు రూ.1.69 కోట్లతో అత్యాధునిక హంగులద్దేందుకు టూరిజం శాఖ టెండర్లు పిలిచింది.

పరిశుభ్రంగా, సర్వాంగ సుందరంగా ఉండే బీచ్‌లకు అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చే బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్‌ను రాష్ట్రంలో దక్కించుకున్న మొట్టమొదటి బీచ్ పొందిన ఉండాలి. ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్(ఎఫ్ఈఈ) అనే డానిష్‌కు చెందిన సంస్థ ఈ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఇది ఒక రకమైన ఎకో-లేబుల్‌గా గుర్తింపు పొందింది. సాగరతీరాలకు 33 కఠినమైన ప్రమాణాల పరీక్షలు నిర్వహించిన తర్వాత సర్టిఫికేట్ జారీ చేస్తారు. తీర వాతావరణం, స్నానపు నీటి నాణ్యత, పర్యావరణ నిర్వహణ, బీచ్ భద్రత, సేవలు వంటి ప్రమాణాలకు అనుగుణంగా రుషికొండ ఈ బీచ్‌ని వరుసగా రెండు సంవత్సరాలు దక్కించుకుంది. అందుకే..బీచ్‌కు అదనపు హంగులు అద్దుతూ.. అంతర్జాతీయ సందర్శకుల్ని సైతం మంత్రముగ్ధులను చేసేలా తీర్చిదిద్దేందుకు పర్యాటక శాఖ అడుగులు వేస్తోంది.

రూ.1.69 కోట్లతో టెండర్లు

ముఖ్యంగా విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షించేలా రుషికొండ బీచ్ అభివృద్ధి ప్రాజెక్టుని రూపొందించారు. పర్యాటకుల భద్రత, కాలుష్యరహిత పరిసరాలు, సముద్ర నీటి నాణ్యత, తీరంలోని ఇసుక మొదలైన బ్లూ ఫ్లాగ్ ప్రమాణాలకు భంగం కలగకుండా.. పర్యాటకులకు కొత్త బీచ్‌ను పరిచయం చేసేందుకు టూరిజం అధికారులు విభిన్న ఆలోచనలతో టెండర్లు పిలిచారు. మొత్తం రూ.1.69,38,789తో రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ అభివృద్ధి ప్రాజెక్టుకు టెండర్లను ఆహ్వానించారు. టెండర్లు ఖరారు అయిన 6 నెలల్లోగా కొత్త సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని టూరిజం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం బ్లూఫ్లాగ్ బీచ్ పరిధిలో సౌర విద్యుత్, పర్యావరణ విద్య, పర్యాటకులు విశ్రాంతి తీసుకోవడానికి బెంచీలు, స్నానం చేయడానికి వీలుగా షవర్స్, బయో టాయిలెట్స్, గ్రే వాటర్ ట్రీట్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, తాగునీటి ఆర్వో ప్లాంట్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు కొత్త ఆలోచనలు అందించాలని నిర్ణయించారు. ఏఏ సౌకర్యాల్ని బ్లూఫ్లాగ్ బీచ్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారంటే....

- పర్యాటకులు నడిచి వెళ్లేందుకు 4,114 చ.మీ విస్తీర్ణంలో ప్రీకాస్ట్ కాంక్రీట్ బ్లాకుల్ని రూ.35.35 లక్షలతో ఏర్పాటు చేయనున్నారు.
- బ్లూఫ్లాగ్ బీచ్‌కు వెళ్లేందుకు రూ.46.54 లక్షలతో కాంక్రీట్ మార్గం కూడా ఏర్పాటు చేయనున్నారు.
- బీచ్‌ని ఆకతాయిలు అపరిశుభ్రంగా చేయకుండా.. రూ.9.97 లక్షలతో 1620 చ.మీ విస్తీర్ణంలో రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- 254 చ.మీ విస్తీర్ణంలో బీచ్ చుట్టూ సందర్శకుల్ని ఆకట్టుకునేలా పెయింటింగ్స్ వేయనున్నారు
- విదేశీ బీచ్‌లను తలపించేలా..సందర్శకుల రక్షణ కోసం రూ.2.88 లక్షలతో బొల్లార్డ్స్, రూ.2.54 లక్షలతో బూమ్ బారియర్స్ ఏర్పాటు చేయనున్నారు.
- రూ.6.78 లక్షలతో టికెటింగ్ క్యాబిన్ రానుంది.
- అదేవిధంగా.. సందర్శకులు సాగరతీరంలో ఆడుకుంటూ.. సేదతీరేందుకు రూ.29.80 లక్షలతో ఫుట్‌బాల్, క్రికెట్‌ని అందుబాటులోకి తీసుకురానున్నారు.
- అదేవిధంగా.. విశాఖ బీచ్‌కు వచ్చే ప్రతి అంతర్జాతీయ పర్యాటకులు కోరుకునే బీచ్ వాలీబాల్ కోర్టు కూడా ఏర్పాటు చేయనున్నారు.
- సాగరతీరంలో వివాహ వేడుక చేసుకునేందుకు ప్రతి జంటా ఉవ్విళ్లూరుతుంటారు. అలాంటి వారికోసం రూ.20 లక్షలతో వెడ్డింగ్ స్టేజ్ కూడా రానుంది.



బీచ్‌లో ఏర్పాటు చేయనున్న బొలార్డ్స్

సంక్రాంతి సంతోషం నింపాలి



వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద భోగి మంటలు, చిత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

- రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంబరాలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): మకర సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో వెలుగు, సంతోషాన్ని నింపాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆకాంక్షించారు. మద్దిలపాలెంలోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సంక్రాంతి వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలాన్ని మకర సంక్రాంతి అంటారని, ఈ సమయానికి రైతుల చేతికి పంటలు అంది సుభిక్షంగా ఉంటారన్నారు. జగనన్న పాలనలో రాష్ట్రంలోని రైతులు సుభిక్షంగా ఉన్నారని, కరోనా కష్టకాలంలో కూడా ఏ లోటు రాకుండా చూసుకున్న జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాలూ ఆదరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ సంక్రాంతి రైతుల పండగ, రైతులు సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య, రొంగలి జగన్నాథం, చొక్కాకుల వెంకటరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పల్లా చిన తల్లి, మాధవి వర్మ, పార్టీ కార్యాలయం ఇన్‌చార్జి రవిరెడ్డి, పార్టీ నేతలు పేర్ల విజయచందర్, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, రోజారాణి, కాశీ విశ్వనాథం, కృపాజ్యోతి, పీలా వెంకట లక్ష్మి, యువశ్రీ, పేడాడ రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేసి పార్టీ మహిళా కార్యకర్తలు సంక్రాంతి పాటలు పాడారు.



గొబ్బియల్లో గొబ్బియల్లో అంటూ హుషారుగా పాట పాడుతున్న మహిళా నేతలు

16న అప్పన్న మకరవేట ఉత్సవం

- వరదరాజస్వామి అలంకారంలో దర్శనమివ్వనున్న అప్పన్న
- ముస్తాబైన కొండదిగువ పూలతోట
- రాత్రి గజవాహనంపై గ్రామ తిరువీధి

సింహాచలం : కనుమ పండుగను పురస్కరించుకుని ఈనెల 16వ తేదీ సోమవారం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి మకరవేట (గజేంద్రమోక్షం) ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సింహాచల దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వరదరాజస్వామి అలంకరణ చేసి సోమవారం సాయంత్రం సింహగిరి నుంచి కొండదిగువకి మెట్లమార్గంద్వారా తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని వేంజేపచేసి గజేంద్రమోక్షం ఉత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామికి విశేష పూజలు చేస్తారు. అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టిస్తారు. తదుపరి అడవివరం గ్రామ పురవీధిల్లో గజవాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటను విశేషంగా ముస్తాబు చే శారు. పూలతోటలోని శ్రీకృష్ణకొలను, స్వామి వేంజేసే ప్రధాన మండపం, రాతి ఫౌంటెన్లుకు విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. ఆరోజు భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.



ఉత్సవం జరిగే పూలతోట

16న సాయంత్రం 6.30గంటల వరకే మూలవిరాట్ దర్శనాలు

మకరవేట ఉత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్ దర్శనాలు సాయంత్రం 6.30గంటల వరకు మాత్రమే లభిస్తాయని, భక్తులంతా ఈవిషయాన్ని గ మనించాలని ఈవో తెలిపారు.

16 నుంచి పట్టాలెక్కనున్న వందేభారత్



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రపంచ స్థాయి సౌకర్యాలతో నిర్మించిన వందేభారత్ రైలు మన రాష్ట్రంలో ఈ నెల 16 నుంచి పట్టాలెక్కనుంది. వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఈ వివరాలు వెల్లడించారు. మన దేశంలో తయారైన ఈ వందే భారత్ 8వ రైలు విశాఖపట్నం -సికింద్రాబాద్ -విశాఖపట్నం మధ్య నడవనుంది. హైస్పీడ్ రైలు కావడంతో ప్రయాణ సమయం 25 నుంచి 45 శాతం ఆదా అవ్వుతుంది. విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) వందేభారత్ విశాఖపట్నంలో ప్రతి రోజూ(ఆదివారం మినహా) ఉదయం 5.45 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్-విశాఖపట్నం(20834) సికింద్రాబాద్‌లో ప్రతి రోజూ (ఆదివారం మినహా) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. సాధారణంగా విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు ప్రయాణ సమయం 12 గంటల నుంచి 15 గంటలు పడుతుంది. కానీ ఈ రైలులో కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే సికింద్రాబాద్ చేరుకోవచ్చు. ఈ రైలు ఇరు మార్గాల్లో వరంగల్, ఖమ్మం, విజయవాడ స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైలు మొత్తం 16 ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్, చైర్ కార్ కోచ్‌లతో నడుస్తుంది.

ప్రారంభోత్సవం సందర్భంగా....

ఈ వందేభారత్ రైలును సికింద్రాబాద్‌లో 15వ తేదీ ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవం రైలు (02844) మాత్రం ఆదివారం 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు బయలుదేరి రాత్రి 8.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. 16వ తేదీ నుంచి రెగ్యులర్ టైమింగ్స్‌తో నడుస్తుంది. ప్రారంభోత్సవ సందర్భంగా ఆదివారం బయలుదేరే ఈ రైలు చర్లపల్లి, భువనగిరి, జనగం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది.

ఒకప్పుడు ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ఇప్పుడు లిక్కర్ డాన్..

- ఒడిశాలో అనధికార డిస్టిలరీ
- అక్కడి నుంచి ఏపీ, తెలంగాణ, ఒడిశాకు నకిలీ మద్యం సరఫరా
- 2021 నుంచి మూడు రాష్ట్రాల పోలీసుల కళ్లుకప్పి తిరుగుతున్న సూర్యనారాయణ
- రియల్ ఎస్టేట్, బొగ్గు వ్యాపారంలోకి అక్రమ మద్యం నిధుల ప్రవాహం
- ఎట్టకేలకు విశాఖలో ఈ నెల 10న అరెస్టు చేసిన భీమిలి సెబ్ పోలీసులు
- ఇక్కడి నుంచి పీటీ వారెంట్ ద్వారా అదుపులోకి తీసుకున్న తెలంగాణ ఎక్సైజ్ అధికారులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): మూడు రాష్ట్రాలను ముప్పతిప్పలు పెట్టిన లిక్కర్ డాన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఈ నెల 10నే పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. విచారణలో సినిమా స్క్రీన్‌ప్లేకు ఏ మాత్రం తగ్గని ట్విస్టులున్నాయి. ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తూ..లిక్కర్ డాన్‌గా ఎదిగాడు.. ఐదేళ్ల నుంచి ఉద్యోగం చేయకుండా తప్పించుకు తిరుగుతూ లిక్కర్ డాన్‌గా రూ.కోట్ల వ్యాపారం చేశాడు. అనకాపల్లికి చెందిన ఆళ్ల ఆది వెంకట సూర్యనారాయణ లిక్కర్ డాన్‌గా ఎదిగి.. పోలీసులకు చిక్కిన వరకు వరకు సంఘటనలు ఒకసారి పరిశీలిద్దాం..

రెండేళ్లుగా మూడు రాష్ట్రాల పోలీసుల కళ్లు కప్పి తప్పించుకొని తిరుగుతున్న అంతర్‌రాష్ట్ర లిక్కర్ డాన్‌ను భీమిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. ఒడిశాలో అనధికార డిస్టలరీలో నకిలీ మద్యం తయారు చేసి.. అక్కడి నుంచి ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పెద్ద ఎత్తున మద్యం తరలిస్తున్న ప్రధాన సూత్రధారి ఆళ్ల ఆది వెంకట సూర్యనారాయణ ఈ నెల 10వ తేదీన అరెస్టు చేసి జైలుకు పంపించారు. 2021లో విశాఖలో పద్మనాభ మండలం రెడ్డిపల్లి గ్రామంలో 210 కేసుల అక్రమ మద్యం పట్టుబడిన కేసులో భీమిలి సెబ్ పోలీసులు చేపట్టి విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మద్యం స్మగ్లింగ్ ద్వారా వచ్చిన అక్రమ సంపాదనను రియల్ ఎస్టేట్, బొగ్గు వ్యాపారంలోకి పెద్ద ఎత్తున మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. అతడిపై తెలంగాణ రాష్ట్రంలో కూడా పలు కేసులు ఉండడంతో అక్కడి ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ నెల 12వ తేదీన భీమిలి కోర్టులో పీటీ వారెంట్ ద్వారా సూర్యనారాయణను అదుపులోకి తీసుకొని రంగారెడ్డి జిల్లాకు తీసుకువెళ్లారు.

అనకాపల్లి టౌన్‌లో లక్ష్మీదేవపేటకు చెందిన ఎ.ఎ.వి.సూర్యనారాయణ ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. గత ఐదేళ్లుగా ఉద్యోగంలోకి వెళ్లకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. అంతర్‌రాష్ట్ర లిక్కర్ డాన్‌గా అవతారమెత్తి మూడు రాష్ట్రాల్లో నకిలీ మద్యం సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఒడిశా రాష్ట్రంలో రాయగాడ టౌన్‌లో అతని భార్యతో పాటు కుటుంబ సభ్యుల పేర్ల మీద వాటాలతో ఎం/ఎస్.ఫైర్ వాటర్ డిస్టిలరీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థను నెలకొల్పాడు. అక్కడ నకిలీ మద్యం తయారు చేసి గతంలో(2022, జనవరిలో) అరెస్టయిన భరణికాన రమణ ద్వారా ఆనందపురం మండలం రెడ్డిపల్లి గ్రామానికి తరలించాడు. అప్పట్లో ఈ కేసులో పలువురిని సెబ్ పోలీసులు అరెస్టు చేసినప్పటికీ సూర్యనారాయణ మాత్రం అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో కేసులను లోతుగా దర్యాప్తు చేసి సూర్యనారాయణ నకిలీ మద్యం వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. ఇతడు 2021లో పాడేరు, అడవివరం, శ్రీకాకుళం జిల్లా రణస్థలం వంటి ప్రాంతాలకు అక్రమ మద్యం సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా స్టేషన్లలో కేసులు సైతం నమోదు చేశారు.

ప్రతీ మూడు నెలలకు అడ్రస్ మారుస్తూ..

ప్రతీ మూడు నెలలకు ఒకసారి అద్దె నివాసాలను మారుస్తూ తప్పించుకొని తిరుగుతూ అక్రమ మద్యం సామ్రాజ్యాన్ని మరింత విస్తరించాడు. నెల్లూరు స్మగ్లర్లకు మద్యం సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకొని వారి నుంచి రూ.6 కోట్లు అడ్వాన్స్‌గాను, ఒడిశా రాష్ట్రానికి జోలాపుట్‌కు చెందిన జగన్నాథస్వామి అనే వ్యక్తి నుంచి రూ.1.2 కోట్లు, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మద్యం స్మగ్లర్ల నుంచి రూ.3 కోట్లు వసూలు చేసి మద్యం సరఫరా చేసినట్లు పోలీసుల విచారణలో నిర్ధారణైంది. తెలంగాణ రాష్ట్రంలో మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఒక పార్టీ అభ్యర్థికి సూర్యనారాయణ అక్రమ మద్యం సరఫరా చేసినట్లు పోలీసుల గుర్తించారు. దీంతో అప్పట్లో రూ.3 కోట్లు విలువైన ఈ మద్యాన్ని సీజ్ చేశారు. వెంటనే విచారణ చేపట్టిన తెలంగాణ పోలీసులు ఒడిశా రాష్ట్ర ఎక్సైజ్ అధికారుల సహకారంతో సూర్యనారాయణ అనధికారికంగా కటక్‌లో నడుపుతున్న లిక్కర్ బాటలింగ్ యూనిట్‌ను గుర్తించి దాన్ని ధ్వంసం చేశారు. అయితే సూత్రధారి సూర్యనారాయణ మాత్రం అప్పుడు కూడా తప్పించుకొని విశాఖలో విశాలాక్షినగర్‌లో ఒక అద్దె ఇంటికి మకాం మార్చాడు.



రియల్ ఎస్టేట్, బొగ్గు వ్యాపారాల్లోకి నిధులు

అక్రమ మద్యం ద్వారా వచ్చిన సంపాదనను సూర్యనారాయణ రియల్ ఎస్టేట్, బొగ్గు వ్యాపారాల్లోకి మళ్లించాడు. అనకాపల్లిలో అతని భార్య ఆళ్ల రంగమణి మేనేజింగ్ పార్టనర్‌గా ఎస్.ఎం. స్క్వేర్ బిల్డర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను ఏర్పాటు చేశాడు. అక్కడ 8 ఫ్లాట్లతో ఒక అపార్టుమెంట్ నిర్మించి బినామీల పేర్ల మీద వాటిని రిజిస్టర్ చేయించాడు. అలాగే గంగవరం పోర్టులో బొగ్గు వ్యాపారంలోను, విశాఖ జిల్లాలో జీడిపప్పు పరిశ్రమలో పెట్టుబడులు పెట్టాడు. అలాగే అతడి బినామీగా ఉన్న పీఏ ఎస్.వి.గణేష్‌రెడ్డి పేరు మీద ఎస్‌బీఐ, ఐడీబీఐ బ్యాంకు అకౌంట్లు తెరిచి వాటి ద్వారా నిధులు మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఇదిలా ఉంటే సూర్యనారాయణ సహచరుడు రవివర్మ ఒడిశా రాష్ట్రంలో బెర్హంపూర్‌లో అనుమానాస్పద మృతిపై కూడా పోలీసులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎట్టకేలకు భీమిలి సెబ్ పోలీసులు సూర్యనారాయణను ఈ నెల 10వ తేదీన విశాఖలో అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో కూడా సూర్యనారాయణపై పలు కేసులు ఉండడంతో అక్కడి అధికారులు ఈ నెల 12వ తేదీన భీమిలీ కోర్టులో పీటీ వారెంట్ ద్వారా అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించేందుకు రంగారెడ్డి జిల్లాకు తీసుకువెళ్లారు.

వీఎంఆర్‌డీఏ ప్లాట్లకు ఈ వేలం

అల్లిపురం (విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన కూర్మన్నపాలెం ఫేస్-1, ఫేస్-2, ఫేస్-6, పెదగంట్యాడ ఫేస్-1, ఫేస్-2, ఫేస్-3, మర్రిపాలెం లే అవుట్, మధురవాడ సైబర్ వాలీ లే అవుట్, చిలుకూరు జాయింట్ వెంచర్, డీఆర్ పద్మావతి జాయింట్ వెంచర్, విజయనగరం పట్టణంలోని కనపాక అయ్యన్నపేట లే అవుట్లలో నివాస అవసరాలకు అనువైన ఎల్.ఐ.జి, ఎం.ఐ.జి, హెచ్.ఐ.జి కేటగిరీ ఖాళీ ప్లాట్లను రాష్ట్ర ప్రభుత్వ ఈ వేలం పోర్టల్ http://konugolu.ap.gov.in ద్వారా విక్రయించనున్నట్లు కార్యదర్శి టి.వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 23వ తేదీ వరకు పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25న వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు.

టౌన్‌ప్లానింగ్ స్పందనకు ఐదు ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ స్పందనకు ఐదు ఫిర్యాదులు వచ్చాయి. జోన్-2 నుంచి ఒకటి, జోన్-3 నుంచి ఒకటి, జోన్-5 నుంచి ఒక్కో ఫిర్యాదు అందగా, జోన్-6 నుంచి రెండు ఫిర్యాదులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదులనైనా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేశారు. నగర ప్రజలు 8187897569కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చు.





సింహగిరిపై నేడు సంక్రాంతి సంబరాలు

రాజగోపురం ఎదురుగా మాడ వీధిలో భోగి మంటకు ఏర్పాట్లు

సింహాచలం: సింహగిరిపై శనివారం సంక్రాంతి సంబరాలు విశేషంగా నిర్వహించేందుకు వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. హిందూ సనాతన ధర్మాన్ని, సంప్రదాయ తెలుగు సంస్కృతి, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా సింహగిరిపై సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో ఉదయం భోగి మంటను వేసేందుకు ఏర్పాట్లు చేశారు. గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జగం దేవర, కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిలగిత్త, ఎడ్లబండి ప్రదర్శనలు ఉంటాయి. గోపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమం చేపట్టనున్నారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు రాజగోపురం మార్గాన్ని విశేషంగా అలంకరించారు.


సింహగిరిపై సంక్రాంతి ఏర్పాట్లు

మైమరిపించే మత్స్యలోకం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్


చేపలను ఆసక్తిగా తిలకిస్తున్న బాలికలు

ఏయూక్యాంపస్: పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా అండర్ వాటర్ టన్నెల్ ఎగ్జిబిషన్ నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న ఏయూ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న హ్యాండ్‌లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అండర్ వాటర్ టన్నెల్ ఏర్పాటు చేయడంపై నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. మన రాష్ట్రంతో పాటు బెంగాల్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులకు ఇది మంచి అనుభూతినిస్తుందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి అక్వేరియంలో విభిన్న వర్ణాల చేపలను ఆసక్తిగా తిలకించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రూ.40కే అక్వేరియంలో వివిధ రకాల చేపలు, స్టార్‌ఫిష్‌లు చిన్నారులకు అనిర్వచనీయమైన అనుభూతిని పంచుతాయన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇస్తున్నామని సెంటర్ ఇన్‌చార్జి జి.మాధవశెట్టి తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ 6 సీట్లు, ప్లంబింగ్ అండ్ జనరల్ 5 సీట్లు ఖాళీ గా ఉన్నాయని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌కు పదో తరగతి, ఐటీఐ పాస్/ఫెయిల్ అయిన వారు, ప్లంబింగ్ అండ్ జనరల్ ట్రేడ్‌కు 8వ తరగతి పాసైన వారు అర్హులన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 35 సంవత్సరాలు ఉండాలని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచితంగా బస్‌పాస్ అందజేస్తామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందిస్తామని, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19లోగా పెదగంట్యాడలోని వేమన ఐటీఐ పక్కన ప్రభుత్వ పాత సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనంలో గల నేక్ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అభ్యర్థులు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91332 42666, 94935 28069 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

26న జ్ఞాన సరస్వతి మహా యజ్ఞం

సీతంపేట(విశాఖ ఉత్తర): వసంత పంచమి సందర్భంగా పెదవాల్తేరు పోలమాంబ గుడి వెనుక ఏయూ కొత్త గ్రౌండ్‌లో ఈ నెల 26న శ్రీజ్ఞాన సరస్వతి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి తెలిపారు. శంకరమఠంరోడ్‌లోని రామలింగేశ్వరాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విరాట్ హిందూ సంఘ్, వాసవి క్లబ్ గ్రేటర్ కపుల్స్, అట్లూరి నారాయణరావు చారిటబుల్ ట్రస్ట్, విశ్వభారతి ప్రింట్ అండ్ మీడియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆ రోజు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు 108 హోమ గుండాలతో యజ్ఞం నిర్వహిస్తామన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్కాపురం(విశాఖ పశ్చిమ): జీవీఎంసీ 61వ వార్డు పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణమని పోలీసులు తెలిపారు. వివరాలివీ.. వార్డు పరిధి జనతాకాలనీలోని అద్దె ఇంట్లో వి.నారాయణరావు(32), అతని భార్య, రెండేళ్ల కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారం సరిగ్గా సాగక, వ్యాపారం కోసం తెచ్చిన రుణాలు కట్టలేని తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అతను బయటకు రాకపోకే సరికి భార్యకు అనుమానం వచ్చి.. కిటికీ నుంచి చూసింది. గదిలో ఫ్యాన్‌కు వేలాడుతున్న భర్తను చూసి షాక్‌కు గురైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని.. వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ లూథర్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్పీ) సబ్ ఇన్‌స్పెక్టర్ వి.బాలాజీరావు తెలిపిన వివరాలివీ.. శుక్రవారం ఉదయం స్టేషన్‌కు సమీపంలో పట్టాలు దాటుతున్న 50 ఏళ్ల వ్యక్తిని విశాఖపట్నం నుంచి నిజాముద్దీన్ వెళ్తున్న స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. అతని వద్ద ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. అతని గురించి తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా లేదా 96661 22722లో సంప్రదించాలని కోరారు.

మాతృ మరణాల నివారణకు చర్యలు


సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): మాతృ మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.జగదీశ్వరరావు వైద్యులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం మాతృ మరణాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదగంట్యాడ, పెందుర్తి రూరల్, నరసింహనగర్ ప్రాంతాల్లో మూడు మాతృ మరణాలు జరిగాయని.. ఇక ముందు సంభవించకూడదని స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి.. ఎనీమియా, ఇతర వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారు వైద్యుల సంరక్షణలో ఉండాలని, ఐరన్ మాత్రలు, టీటీలు వేయించుకోవాలని, సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ జీవన్‌రాణి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషా ప్రసాద్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ విద్యారమా, డాక్టర్ శిరీష, డాక్టర్ నాయుడు, డాక్టర్ ఉమావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శిశు గృహ సందర్శన


శిశు గృహ మేనేజర్ సుజాతతో మాట్లాడుతున్న బులికృష్ణ

మద్రిపాలెం(విశాఖ ఉత్తర): జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెంలోని శిశుగృహ కేంద్రాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బులికృష్ణ శుక్రవారం సందర్శించారు. సంక్రాంతి పురస్కరించుకుని చిన్నారులకు నూతన దుస్తులు అందించారు. శిశుగృహ మేనేజర్ సుజాత, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది అప్పారావు, కాశీ పాల్గొన్నారు.











స్వాధీనత నోటీసు రూల్-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచి, సికింద్రాబాద్, హైదరాబాద్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ అక్టు 2002 ప్రకారము & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క రూల్ 3తో చదివే సెక్షన్ 13(12) ప్రకారము సంక్రమించిన అధికారములతో <u>ఋణగ్రహీతలు :</u> మెస్సర్స్ అపెక్స్ ఎన్‌కాన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, (ఇప్పటి నుండి ఋణగ్రహీత కంపెనీగా పిలువబడును), ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ డైరెక్టర్, 1-54-11, ప్లాట్ నెం.హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017 (ఇప్పటి నుండి ఋణగ్రహీత కంపెనీగా పిలువబడును) మరియు 1) శ్రీ నెక్కంటి రామారావు, తండ్రి. (లేటు) శ్రీ ఎన్. సత్తిరాజు, 1-54-11, ప్లాట్ నెం.హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017. 2) శ్రీ ఎన్. ఆంజనేయ వర్మ, తండ్రి. (లేటు) శ్రీ ఎన్. వి. నారాయణ, 1-54-11, ప్లాట్ నెం.హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017. 3) శ్రీ నెక్కంటి కృష్ణ, తండ్రి. (లేటు) శ్రీ ఎన్. ఎన్.సత్తిరాజు, కొత్తవలస, సాలూరు మండలం, విజయనగరం జిల్లా. 4) శ్రీ నెక్కంటి వెంకట ఆంజనేయ వర్మ, తండ్రి. శ్రీ ఎన్. వి. వెంకన్న, కొత్తవలస, సాలూరు మండలం, విజయనగరం జిల్లా. 5) శ్రీమతి నెక్కంటి పద్మావతి, భర్త. శ్రీ ఎన్. రామారావు, 1-54-11, ప్లాట్ నెం. హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017. 6) శ్రీ నెక్కంటి సుబ్బారావు, తండ్రి. లేటు శ్రీ ఎన్. సత్తిరాజు, కొత్తవలస, సాలూరు మండలం, విజయనగరం జిల్లా. 7) మెస్సర్స్ ఉషా మాధురి ఎంటర్‌ప్రైజెస్ ప్రై లి., 1-54-11, ప్లాట్ నెం. హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017. (ఇప్పటి నుండి హామీదారులుగా పిలువబడును) వారు తేది.16.12.2015 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.487,92,53,149/- (అక్షరాల నాలుగు వందల ఎనభై ఏడు కోట్ల తొంభై రెండు లక్షల యాభై మూడు వేల నూట నలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వితో కలిపి నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం తేది.23.12.2015 న డిమాండ్ నోటీసును జారీ చేసినారు.

ఇందుమూలముగా, ఐడీబీఐ బ్యాంక్ లి., స్పెసిలైజ్డ్ కార్పొరేట్ బ్రాంచి, బెంగుళూరు యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ అక్టు 2002 ప్రకారము & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క రూల్ 3తో చదివే సెక్షన్ 13(12) ప్రకారము సంక్రమించిన అధికారములతో <u>ఋణగ్రహీతలు :</u> మెస్సర్స్ అపెక్స్ ఎన్‌కాన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, (ఇప్పటి నుండి ఋణగ్రహీత కంపెనీగా పిలువబడును), ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ డైరెక్టర్, 1-54-11, ప్లాట్ నెం.హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం- 530017 (ఇప్పటి నుండి ఋణగ్రహీత కంపెనీగా పిలువబడును) మరియు 1) శ్రీ నెక్కంటి రామారావు, తండ్రి. (లేటు) శ్రీ ఎన్. సత్తిరాజు, 1-54-11, ప్లాట్ నెం.హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017. 2) శ్రీమతి నెక్కంటి పద్మావతి, భర్త. శ్రీ ఎన్. రామారావు, 1-54-11, ప్లాట్ నెం. హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017. 3) శ్రీ ఎన్. ఆంజనేయ వర్మ, తండ్రి. (లేటు) శ్రీ ఎన్. వి. నారాయణ, 1-54-11, ప్లాట్ నెం. హెచ్.ఐ.జి-51, సెక్టార్-1, ఎమ్.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017. (ఇప్పటి నుండి హామీదారులుగా పిలువబడును) వారు తేది.30.12.2013 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.159,35,88,666.17 పై (అక్షరాల నూట యాభై తొమ్మిది కోట్ల ముప్పై ఐదు లక్షల ఎనభై ఎనిమిది వేల ఆరు వందల అరవై ఆరు రూపాయల పదిహేడు పైసలు మాత్రమే) మరియు వడ్డీ, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వితో కలిపి నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం తేది.18.11.2015 న డిమాండ్ నోటీసును జారీ చేసినారు.

కన్సార్టియంలో సభ్యుడిగా ఉన్న ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్., స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచి, సికింద్రాబాద్, హైదరాబాద్‌కు తమకు అందించిన అధికారాలకు అనుగుణంగా చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(9) ప్రకారం కన్సార్టియం లీడర్‌గా కొనసాగడానికి అనుమతి ఇవ్వడం జరిగింది.

ఋణగ్రహీతలు/హామీదారులు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 8 తో చదివే సదరు చట్టంలో సెక్షన్ 13(4) ప్రకారము తేది.11.01.2023 న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఎస్.బి.ఐ & ఐడీబీఐ నేతృత్వంలో కన్సార్టియం బ్యాంకుల తరుపున సభ్యులుగా ఉన్నారు.

ఋణగ్రహీతలు/హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవి అయినా మొత్తం రూ.740,45,47,969.48 పై (అక్షరాల ఏడు వందల నలభై కోట్ల నలభై ఐదు లక్షల నలభై ఏడు వేల తొమ్మిది వందల అరవై తొమ్మిది రూపాయల నలభై ఎనిమిది పైసలు మాత్రమే) మరియు తేది.17.02.2016 నుండి సంబంధిత బ్యాంకుల ఒప్పంద రేట్లు + భవిష్య వడ్డీ మరియు ఖర్చులతో సహా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా & ఐడిబిఐ బ్యాంక్ లి., ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు సెక్యూర్డు ఆస్తి విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలు గమనించగలరు.

కన్సార్టియం బ్యాంకుల పేర్లు	వర్తించిన వడ్డీ	మొత్తం బకాయి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	16.02.2016	రూ.500,64,99,734.62 పై
ఐడీబీఐ బ్యాంక్ లి.,	16.02.2016	రూ.239,80,48,234.86 పై
మొత్తం బకాయి		రూ.740,45,47,969.48 పై

<u>స్థిరాస్తి వివరములు</u>

అహ్మద్‌నగర్ జిల్లా, నగర్ జిల్లా & రిజిస్ట్రేషన్, నాగ్‌పూర్ గ్రామం తాలూక మరియు రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా పరిధి, అహ్మద్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని 12000 చ॥మీ॥లు విస్తీర్ణం నందు ప్లాట్ నెం.బి-2 తో గల భూమి. <u>హద్దులు :</u> తూర్పు : ప్లాట్ నెం.బి-3, దక్షిణం : ఎమ్.ఐ.డి.సి రోడ్డు, పడమర : ప్లాట్ నెం.బి-1, ఉత్తరం : ప్లాట్ నెం.బి-21.
(లీజు డీడ్ నెం. 2860/10 తేది.26.05.2010)

తేది : 11.01.2013
ప్రదేశం : అహ్మద్‌నగర్
సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SAM బ్రాంచి, సికింద్రాబాద్